- పత్తి కొనాల్సిందే..



నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ కాటన్ మిల్లులోని సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లను నిలిపివేయడంతో గురువారం రైతులు ఆందోళనకు దిగారు. దళారుల నుంచి కొనుగోలు చేయడానికే తమ నుంచి పత్తి కొనడం లేదంటూ రైతులు మిల్లు ఎదుట నిరసనకు దిగారు. - చండూరు

- ఇథనాల్ కంపెనీ వద్దే వద్దు..



సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ ఎదుట పలు గ్రామాల ప్రజలు, నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలను గురువారం పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, స్థానికుల మధ్య తోపులాట జరగడంతో పలువురు నాయకులను అరెస్టు చేశారు. - మోతె

- సార్లేరి.. సౌకర్యాలేవి..




పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లను నియమించి, సౌకర్యాలన్నీ కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదుట వైద్య విద్యార్థులు ధర్నా నిర్వహించారు. కనీస వసతులు కల్పించలేదంటూ ఆందోళనకు దిగారు. - ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్



వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పత్తినాయక్ తండావాసులు

# తండాను జీపీలో విలీనం చేయొద్దు

- వరంగల్ కలెక్టరేట్ ఎదుట పత్తినాయక్ తండావాసుల ధర్నా

ఖిలావరంగల్, జనవరి 2: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లో తమను విలీనం చేయొద్దని కోరుతూ సేవాలాల్ సేన, లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పత్తినాయక్ తండావాసులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ సర్కారు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు కునుసోతు మురళీనాయక్ మాట్లాడుతూ రెండువేల మందితో జీపీగా ఉన్న పత్తినాయక్‌తండాను ఎమ్మెల్యే సొంత గ్రామమైన అమీనాబాద్‌లో విలీనం చేసేందుకు గత డిసెంబర్ 31న గ్రామసభ పేరుతో పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సభలో ప్రజలు విలీనాన్ని తిరస్కరించారని చెప్పారు. 'మా తండాలో మా రాజ్యం' పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీపీలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. అనంతరం కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించారు.

- విద్యాశాఖలో విలీనం చేయాలి




తమను విద్యాశాఖలో విలీనం చేయాలని మోడల్ స్కూల్, హాస్టళ్లలోని నాన్ టీచింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్, హాస్టల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సైఫాబాద్‌లోని విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. - ఖైరతాబాద్




జనగామ కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర మంత్రుల ఫొటో మాస్కులను ధరించి నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

# 24వ రోజుకు చేరిన ఎస్‌ఎస్‌ఏల సమ్మె

## సీఎం, మంత్రుల మాస్కులు ధరించి నిరసన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 2: తమను రెగ్యులరైజ్ చేయడంతోపాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రుల ఫొటోలతో కూడిన మాస్కులు ధరించి నిరసన తెలిపారు. ఆదిలాబాద్‌లో కలెక్టరేట్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ తీశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు ముఖాలకు సీఎం రేవంత్, మంత్రుల చిత్రపటాల మాస్కులను ధరించి ర్యాలీ చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో దీక్షా శిబిరం నుంచి నేతాజీ చౌక్‌లోని అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర నిర్వహించారు. గద్వాలలో వంటావార్పు, నాగర్‌కర్నూల్‌లో మానవహారం నిర్మించారు. కామారెడ్డిలో ఉద్యోగులు తాళ్లతో చేతులు కట్టేసుకుని నిరసన తెలిపారు. వికారాబాద్‌లో ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించి బీజేఆర్ చౌరస్తా వద్ద సీఎం, మంత్రుల మాస్కులను ధరించి నిరసన తెలిపారు. హనుమకొండలో శివుడు, రుద్రమదేవి, పోతరాజు, గణపతిదేవుడు, భరతమాత, సమ్మక్క-సారలమ్మ వేషధారణతో ఉద్యోగులు మహా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. ఖమ్మంలో సీఎం, మంత్రుల మాస్కులు ధరించి పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ తీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో గురువారం సీఆర్టీ ఉపాధ్యాయురాలు పద్మ (మామడ కేజీబీవీ) సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను దవాఖానకు తరలించారు. 24 రోజులుగా సమ్మెలో పాల్గొనడంతో పద్మ ఆరోగ్యం క్షీణించిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. - నిర్మల్ అర్బన్




కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ స్పందనకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

# మూడు నెలల వేతనాలు చెల్లించండి

## సమ్మె బాటలో కామారెడ్డి మున్సిపల్ కార్మికులు

కామారెడ్డి, జనవరి 2 : మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కామారెడ్డి మున్సిపల్ కార్మికులు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శానిటేషన్, నీటి సరఫరా, ఎలక్ట్రికల్ విభాగాల్లో 380 మంది కార్మికులు 30 ఏండ్లుగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందనకు వినతిపత్రం అందజేశారు.

- ఠాణా ఎదుట బాధితుడి నిరసన



తనపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు చెందిన కాటూరి రాము గురువారం పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించారు. ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసి వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. - నూతనకల్

# సర్కార్‌ను నమ్మి నిరుద్యోగులైనం!

- జెన్‌కోలో ఉద్యోగం వచ్చినదని కేంద్ర కొలువులకు రాజీనామా
- సర్టిఫికెట్‌వెరిఫికేషన్ పూర్తయి 4 నెలలు
- నియామకపత్రాలు ఇవ్వని ప్రభుత్వం
- విద్యుత్తుసౌధ ఎదుట అభ్యర్థుల ధర్నా
- వెంటనే పోస్టింగ్ ఇవ్వాలంటూ డిమాండ్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ సంస్థ 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'లో అతడిది మంచి ఉద్యోగం, అంతేస్థాయి వేతనం. కానీ సొంత రాష్ట్రంలో పనిచేయాలన్న కోరికతో టీఎస్ జెన్‌కోలో ఉద్యోగం కోసం ప్రయత్నించి, సాధించాడు. నిరుడు సెప్టెంబర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. 15 రోజుల్లో నియామక పత్రాలు ఇస్తామన్న సర్కారు మాటలు నమ్మిన అతడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నియామకపత్రాలు ఇవ్వకపోవడంతో పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇటు కొత్త కొలువు రాక, అటు ఉన్న కొలువు పోయి, నాలుగు నెలలుగా జీతం లేక నిరుద్యోగిగా మిగిలాడు.



విద్యుత్‌సౌధ ఎదుట ధర్నాకు దిగిన అభ్యర్థులు

- మరో అభ్యర్థిది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్)లో ఉద్యోగం. ఏడాదికి రూ.19 లక్షల వేతనం. జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ఉద్యోగం రావడంతో ఐవోసీఎల్‌కు రాజీనామా చేశాడు. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు నిరుద్యోగిగా మిగిలాడు.
- ఇంకొక అభ్యర్థి కాగ్నిజెంట్‌లో రూ.లక్షల వేతనం వచ్చే ఉద్యోగం వదులుకోగా, మరో అభ్యర్థి పీహెచ్‌డీ సీటును రద్దు చేసుకున్నాడు. వీరిలో ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. వీరే కాదు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ లక్షల్లో జీతాలు అందుకుంటున్న పలువురు అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి నట్టేట మునిగిపోయామని లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ఉద్యోగాలకు ఎంపికైన ఆ అభ్యర్థులంతా గురువారం హైదరాబాద్ విద్యుత్తు సౌధ ఎదుట ధర్నాకు దిగారు. వెంటనే నియామక పత్రాలు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కండ్ల ముందుకొచ్చిన కొలువు చేతిదాకా రాకపోవడంతో కడుపు మండి వారంతా గురువారం నిరసనల బాటపట్టారు.

**15 రోజుల్లో ఉత్తర్వులని.. మాట తప్పారు!**

టీజీ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం 2023 అక్టోబర్ 4న జెన్‌కో నోటిఫికేషన్ జారీచేసింది. 339 ఏఈ, 60 కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి 2024 జూలై 14న రాత పరీక్ష నిర్వహించారు. ఫలితాలు ప్రకటించి 2024 సెప్టెంబర్ 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఐదేండ్లు పనిచేసేందుకు అధికారులు బాండ్ కూడా రాయించుకున్నారు. 15 రోజుల్లో నియామక ఉత్తర్వులు ఇస్తామని చెప్పారు. దీంతో చాలామంది అభ్యర్థులు అప్పటివరకు చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు నియామకపత్రాలు ఇవ్వలేదు. దీంతో ఎంపికైన అభ్యర్థులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆ తర్వాత జెన్‌కో కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవలే గాంధీభవన్ ఎదుట అభ్యర్థులు ధర్నా చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గురువారం విద్యుత్తు సౌధ ఎదుట ధర్నాకు దిగారు. తక్షణమే తమకు నియామకపత్రాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు.




దయారా బుగ్యల్ శిఖరాన్ని అధిరోహించిన తండ్రీకూతుళ్లు ఏబీఆర్‌రెడ్డి, సింధు

# 70 ఏండ్ల వయస్సులో శిఖరమంత ఆత్మవిశ్వాసం

## 3 రోజుల్లో..12వేల అడుగుల ఎత్తయిన పర్వతం అధిరోహణ

### ఆదర్శంగా నిలిచిన హైదరాబాద్ డాక్టర్ ఏబీఆర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 2 (నమస్తే తెలంగాణ ): హిమాలయాల్లో ట్రెక్కింగ్ అంటే మాములు విషయం కాదు. అందులోనూ 70 ఏండ్ల వయసులో ఓ డాక్టర్ ఈ ఘనతను సాధించాడు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఏబీఆర్పీ రెడ్డి ఏకంగా 12వేల అడుగుల ఎత్తయిన దయారా బుగ్యల్ అనే శిఖరాన్ని అధిరోహించి ఔరా అనిపించాడు. అతడితో పాటు కూతురు సింధు కూడా ఈ యాత్ర పూర్తిచేసింది. అసలే చలికాలం.. అందులోనూ ఏడు పదుల వయస్సులో ఈ ఘనతను సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఇదే స్ఫూర్తితో 18వేల అడుగుల ఎత్తైన శిఖరాన్ని అధిరోహించేందుకు ప్రయత్నిస్తానని డాక్టర్ ఏబీఆర్ రెడ్డి తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ, వ్యాయామంపై ప్రత్యేక దృష్టి వల్లే విజయవంతంగా పూర్తిచేసినట్టు వివరించారు. తన కూతురు ఎంతో ప్రేరణనిచ్చిందని తెలిపారు. ఇప్పటికే ఐదుసార్లు హిమాలయాల్లో ట్రెక్కింగ్ చేసినట్టు తెలిపారు.

# కానిస్టేబుళ్లపై కాంగ్రెస్ కౌన్సిలర్ల దౌర్జన్యం

- సొంతపార్టీ నేతపై దాడిని అడ్డుకున్న పోలీసులతో దురుసు ప్రవర్తన
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కానిస్టేబుళ్లు

మహబూబ్‌నగర్, జనవరి 2 : ప్రజాపాలన ప్రభుత్వం అని చెప్పుకొంటున్న పార్టీకి చెందిన కౌన్సిలర్లు కానిస్టేబుళ్లపై దౌర్జన్యంగా వ్యవహరించిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు ఫైజల్ స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి బర్త్‌డేను పురస్కరించుకుని బ్యానర్ ఏర్పాటు చేశాడు. దీంతో స్థానిక కౌన్సిలర్లు రషీద్‌ఖాన్, ఖాజాపాషాతోపాటు మోసిన్‌ఖాన్ వచ్చి బ్యానర్‌ను తొలగించి ఫైజల్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీను అడ్డుకునే యత్నంచేశారు. అయినా వినకపోవడంతో వారు మొబైల్ ఫోన్‌లో వీడియో తీశారు. దీంతో కౌన్సిలర్లు కానిస్టేబుళ్ల ఫోన్లను బలవంతంగా లాక్కున్నారు. గురువారం దీనిపై కానిస్టేబుళ్లు సీఐకి ఫిర్యాదు చేశారు.

# 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తరు?

- ఎక్స్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నిరుద్యోగులు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్న కాంగ్రెస్ నేతల పోస్టుకు టీజీపీఎస్సీ అభ్యర్థులు తీవ్రంగా స్పందించారు. 'అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తరు? మీరు ఇచ్చిన హామీలను ఒక్కసారి గుర్తుచేసుకోండి. అధికారంలోకి వచ్చాక ఏడాదిలో ఎన్ని కొత్త నోటిఫికేషన్లు ఇచ్చారు. మీరు పదే పదే వల్లించే రోల్‌మాడల్ ప్రభుత్వమంటే హక్కుల సాధనకు చేస్తున్న శాంతియుత నిరసనలను అణిచివేడమేనా'? అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# ఢిల్లీ దూతపై అధిష్ఠానం వేటు?

## ఆమెపై రాష్ట్ర కాంగ్రెస్ నేతల ఫిర్యాదు.. అధిష్ఠానం పరిశీలనలో ముగ్గురి పేర్లు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చూస్తున్న అధిష్ఠానం దూతను మార్చనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఢిల్లీ దూతపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పార్టీలో చేరికలు, పదవుల పంపకాలలో ఆమె ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, నామినేటెడ్ పోస్టులు బహిరంగ మార్కెట్‌లో పెట్టి విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిసింది. రాహుల్‌గాంధీకి నమ్మకస్తునిగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం ఆ దూతను మార్చే ఆలోచనతో ఉన్నట్టు గాంధీ భవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ వలస నేతకు ఎంపీ టికెట్ ఇప్పించారనే ప్రచారం జరిగింది. ఆ ఎన్నికల్లో సదరు నేత ఓడిపోగా, మళ్లీ అతనికే ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. ఆ దూత స్థానంలో పొరుగు రాష్ట్రాలకు సీనియర్ కాంగ్రెస్ నేతల పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.

# అసంతృప్తులకు డీసీసీ పదవులు!

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేనిచోట సంపన్నులకు అవకాశం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): మంత్రి పదవులు ఇవ్వలేని ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష పదవులు అప్పగించే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తున్నది. త్వరలో స్థానిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అసమ్మతిని, అసంతృప్తులను తృప్తిపరిచేందుకు పార్టీ పదవులను ఎరగా వేయాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లాలో సీనియర్లుగా ఉండి, మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు డీసీసీ బాధ్యతలు అప్పగించి సంతృప్తి పరచాలని ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. వారికి పదవులు అప్పగించడం ద్వారా స్థానిక అవసరాలకు అవసరమైన నిధుల సమస్య కూడా తగ్గుతుందని ముఖ్యనేత ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. మెదక్ డీసీసీ అధ్యక్షుడిగా వలస కాంగ్రెస్ నేత పేరును పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం. పఠాన్‌చెరు ప్రాంతానికి చెందిన సదరు నేత అవసరమైతే డబ్బు ఖర్చు చేయగలడనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది.

# ఆలయాల్లో విజయ నెయ్యే వాడాలి!

- యాదాద్రికి మార్చి వరకు మినహాయింపు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తప్పనిసరిగా ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ నెయ్యిని మాత్రమే వాడాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. యాదాద్రికి మాత్రం మార్చి వరకు మినహాయింపునిచ్చింది. తిరుమల లడ్డూ వివాదం అనంతరం రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో విజయ నెయ్యిని మాత్రమే వాడాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి ప్రైవేటు డెయిరీతో ఒప్పందం చేసుకున్న భద్రాద్రి ఆలయ అధికారులపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. ఇతర ఆలయాల్లో నెయ్యి సరఫరాపై సమీక్షించి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఇతర డెయిరీలతో ఉన్న ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. యాదాద్రిలో స్థానిక ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు మార్చి చివరి వరకు మదర్ డెయిరీ నెయ్యి సరఫరా కానుంది.

# దివ్యాంగులకు జీవాంజి దీప్తి గర్వకారణం

- పారాలింపిక్స్ పతక విజేతగా విశేష గుర్తింపు
- 'అర్జున'కు ఎంపికవడం హర్షణీయం
- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని



మలక్‌పేట, జనవరి 2: పారాలింపిక్స్ కాంస్య పతక విజేత జీవాంజి దీప్తి విశిష్ట క్రీడా పురస్కారమైన అర్జున అవార్డుకు ఎంపికవడం దివ్యాంగులందరికీ గర్వకారణమని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు. హైదరాబాద్‌లోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పారాలింపిక్స్‌లో కాంస్యపతక విజేత జీవాంజి దీప్తి ఎంపికవడం విశేషమైని పేర్కొన్నారు. ఆమె అర్జున అవార్డుకు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులతో కలిసి దీప్తి, కోచ్ నాగపురి రమేశ్ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశామని వివరించారు. ఈ సందర్భంగా దీప్తికి రూ.కోటి నగదు పురస్కారం, 500 గజాల ఇంటిస్థలం, గ్రూప్-2 ఉద్యోగం ఇస్తామని సీఎం ప్రకటించారని తెలిపారు. అందుకు దివ్యాంగుల తరపున సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. క్రీడాకారులు దీప్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు షెడ్యూల్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తేతెలంగాణ) : ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షల పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను డైరెక్టర్ పీవీ శ్రీహరి గురువారం విడుదల చేశారు. ఈ నెల 9 నుంచి 22 వరకు చెల్లించవచ్చని సూచించారు. రూ.25 అపరాధ రుసుముతో ఈ నెల 23 నుంచి 29 వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెల్లించవచ్చని వెల్లడించారు. తత్కాల్ కింద ఫిబ్రవరి 4 నుంచి 5 వరకు చెల్లించవచ్చని తెలిపారు.

# స్త్రీవిద్యకు సావిత్రీబాయి పూలే విశేష కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): స్త్రీవిద్య కోసం సావిత్రీ బాయి పూలే విశేష కృషి చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. సావిత్రీ బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంత్రి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా సావిత్రీబాయి జయంతి

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : జనవరి 3న సావిత్రీ బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రమంతటా ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి గురువారం జీవో-9 జారీచేశారు. ఇకపై యేటా జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.